## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీలో తెనాలి నియోజకవర్గం పలువురికి పదవులు



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ అయ్యా యి. ఇందులో తెనాలి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. యువజన విభాగం అధ్యక్షుడిగా గుంటూరు గోపి, మహిళ విభాగం అధ్యక్షురాలిగా కొర్రా యశోద, రైతు విభాగం అధ్యక్షుడిగా కె.శంకర్, బీసీ విభాగం అధ్యక్షుడిగా మోర్ల శ్రీను, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా ఉన్నం అనీష్, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా పొట్లూరి అశోక్, మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా షేక్ మెహబూబ్ బాషా, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పల్లె రోహిత్ శామ్యూల్, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షురాలిగా భట్టిప్రోలు వెంకటలక్ష్మి, వలంటీర్స్ విభాగం అధ్యక్షుడిగా పి.రత్నబాబు, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా ఆవుల కోటయ్య, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా అక్కిదాసు కిరణ్ కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా తాతా సతీష్, వైఎస్సార్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా అత్తోట అమృతరాజు, లీగల్ విభాగం అధ్యక్షుడిగా మాల్యా విజయ్, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా లక్ష్మణ శాస్త్రి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా నీలి అజయ్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ అసద్, ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడిగా బండికల పోతురాజు, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా అవుతు శేఖర్‌రెడ్డిలను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

### వ్యవసాయశాఖ ఏడీఏగా విజయబాబు

తెనాలిటౌన్: వ్యవసాయ శాఖ, తెనాలి ఏడీఏగా రాగాల విజయబాబు బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న విజయబాబు, తెనాలి, కొల్లిపర ఏవోల కన్నా సీనియర్ అయినందున ఆయనను ఇన్‌ఛార్జి ఏడీఏగా నియమించారు.

### వ్యర్థాలు కన్పిస్తే ఊరుకోను

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు కన్పిస్తే సహించేది లేదని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబు హెచ్చరించారు. యడ్ల లింగయ్య కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, పూలే కాలనీలలో బుధవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. కాలనీలోని ప్రతి కాల్వను బాగుచేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, ఉద్యోగులు ఉన్నారు.

### ఎంహెచ్‌వో డాక్టర్ యేసుబాబుకు అదనపు బాధ్యతలు



తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబుకు అసిస్టెంట్ కమిషనర్‌గా బుధవారం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచి ఆయన ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా కూడా వ్యవహరించనున్నారు.

### రైలు నుంచి పడి వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైల్లో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి బుధవారం మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడు లేత గోధుమ రంగు షర్టు, కాఫీ పొడి రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తెనాలి జీఆర్పీ పోలీసులు రైల్లో నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని జేబులో సెల్‌ఫోన్ ఛార్జర్, తాళం చెవి ఉన్నాయి. షర్టు కాలర్‌పై వీనస్ టైలర్స్ లంబాడీపేట విజయవాడ అని లేబుల్ ఉంది. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వెంకటాద్రిబాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614లో సంప్రదించాలన్నారు.

### జ్వరంతో యువకుడి మృతి



తూములూరు(కొల్లిపర): జ్వరంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల వివరాలు మేరకు మండలంలోని తూములూరు గ్రామంలోని గౌడపాలెం కుచెందిన శొంఠి సాయిరాఘవేంద్ర (25) వారం రోజుల క్రిందట తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో కొల్లిపర గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటూ ఉండగా సోమవారం ఒక్క సారిగా ఆరోగ్యం విషమించింది. వెంటనే తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకువెళ్లాలని సిబ్బంది సూచించారు. దీంతో బంధువులు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు పోయాయి. గ్రామంలో చాలా మందికి ఇలాంటి జ్వరాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు, వైద్యులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

# నాడు ఘనం - నేడు శూన్యం!

- గత నెల వరకు అరకొర సర్జరీలతో సరిపెట్టిన వైద్యులు
- రెండేళ్లగా డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్ట్ ఖాళీ
- సివిల్ సర్జన్ లీవ్‌పై వెళ్లటంతో పూర్తిగా నిలచిన కంటి వైద్య సేవలు
- ఇబ్బందులు పడుతున్న కంటి సమస్య బాధితులు



రోగులు లేకపోవడంతో ఖాళీగా కంటి వార్డు



వైద్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న కంటి విభాగ ఓపీ

తెనాలిఅర్బన్: నాడు ఘనం... నేడు శూన్యం అన్న చందానా తెనాలి జిల్లా వైద్యశాలలోని ఆప్తమాలజీ విభాగం తయారైంది. గతంలో కంటి విభాగం రోగులతో కిక్కిరిసి ఉండగా నేడు పూర్తిగా వార్డును మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తెనాలి డివిజన్ పరిధిలోని వృద్ధులు, కంటి సమస్యలతో బాధపడే వారు జిల్లా వైద్యశాలకు వచ్చి వెనుతిరిగి వెళ్ళాల్సి వస్తోంది.

తెనాలి జిల్లా వైద్యశాలలో ఆప్తమాలజీ (కంటి) విభాగం ఉంది. దీనిలో ఒక రిఫ్రాక్షనిస్ట్, ఒక డిప్యూటీ సివిల్ సర్జన్, ఒక సివిల్ సర్జన్ వైద్యులు పని చేసేవారు. ప్రతిరోజు సుమారు 50 నుంచి 75 మంది కంటి సమస్యలతో బాధపడే రోగులు అక్కడికి వచ్చి చికిత్స పొందేవారు. అలాగే క్యాటరాక్ట్(శుక్లాల) ఆపరేషన్, టెరీజియం (కంటి పొర తీసివేయటం) వంటి ఆపరేషన్‌లు కూడ ప్రతిరోజు అయిదు వరకు జరిగేవి. అంటే నెలకు సగటున 150 ఆపరేషన్‌లు చేస్తు వచ్చారు. ఒక్కో సందర్భంలో కంటి వార్డు చాలక ప్రక్క వార్డులో రోగులను ఉంచి చికిత్స అందించిన సందర్భాలు తెనాలిలో ఉన్నాయి. రాష్ట్రంలోనే కంటి విభాగానికి మంచి ర్యాంకు వచ్చిన సందర్భాలు గతంలో అనేకం ఉన్నాయి.

**రెండేళ్ల నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్ట్ ఖాళీ**

తెనాలి జిల్లా వైద్యశాలలో రెండేళ్ల నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్ట్ ఖాళీగా ఉంటూ వస్తోంది. సివిల్ సర్జన్ పోస్ట్‌లో ఉన్న వైద్యులే అన్ని సేవలు అందించాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో కైకలూరు నుంచి డిప్యూటేషన్‌పై డాక్టర్ రమాదేవి తెనాలివచ్చి కంటి సర్జరీలు చేస్తు వచ్చారు. ఆమె డిప్యూటేషన్‌ను మార్చిలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగ ఉన్నతాధికారులు రద్దు చేయడంతో ఆమె వెళ్ళిపోయారు. అలాంటి సమయంలో డాక్టర్ సుజాతను తెనాలి పంపారు. ఆమె విధులలో చేరిన నెలకే మరలా ఆమెను తణుకు బదిలీ చేశారు. సివిల్ సర్జన్ పోస్ట్‌లో ప్రస్తుతం ఉన్న డాక్టర్ చిన్నమ్మ ప్రతి రోజు ఓపీ చూడటంతో పాటు మంగళవారం సదరం క్యాంప్‌లో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మిగిలిన రోజులలో శుక్లాలు తొలగింపు ఆపరేషన్‌లు మాత్రమే చేస్తు వస్తున్నారు. కంటి పొరల తొలగింపు ఆపరేషన్‌లు తాను చేయలేనని చెప్పటంతో ఏప్రిల్ నుంచి పూర్తిగా నిలచిపోయాయి. ఇది ఇలా ఉంటే ఆమె ఆగస్ట్ 17 నుంచి సెలవుపై వెళ్లారు. నవంబర్ వరకు సెలవులోనే ఉంటారు. దీంతో ఆప్తమాలజీ విభాగంలో సేవలు అందించే వారు లేక వార్డును అధికారులు మూసివేశారు. ఓపీ సేవలు కూడా పూర్తిగా నిలచిపోయాయి. దీంతో తెనాలి డివిజన్ పరిధిలోని కంటి సమస్యలతో బాధపడే రోగులు ఇక్కడికి వచ్చి వెనుతిరిగి వెళ్లాల్సి వస్తోంది.

**రిఫ్రాక్షనిస్ట్ పోస్ట్‌ను రద్దు చేసిన ప్రభుత్వం**

కంటి విభాగంలో రిఫ్రాక్షనిస్ట్ ఉద్యోగి పాత్ర కీలకంగా ఉంటుంది. కంటి సమస్యలతో వచ్చిన రోగులను సదరు ఉద్యోగి పరీక్షలు చేసి కంటికి సంబంధించిన వివరాలు నమోదు చేసి వైద్యుల వద్దకు పంపుతుంటారు. అలాగే సర్జరీల సమయంలో వారు సహకారులుగా ఉంటారు. అలాంటి పోస్ట్‌ను కూటమి ప్రభుత్వం ఫిబ్రవరిలో రద్దు చేసింది. ఆ పోస్ట్‌లో పనిచేసే ఉద్యోగిని గుంటూరు మెడికల్ కళాశాలకు పంపారు. దీంతో స్థానిక అధికారులు విజ్ఞప్తి మేరకు మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే టెక్నిషియన్‌ను సదరం రోజు డిప్యూటేషన్‌పై పంపుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి తెనాలి జిల్లా వైద్యశాలలో రిఫ్రాక్షనిస్ట్ పోస్ట్‌ను ఏర్పాటు చేయటంతో పాటు ఖాళీగా ఉన్న డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్ట్‌ను భర్తీ చేయటంతో పాటు పూర్తిగా నిలచిపోయిన ఆప్తమాలజీ సేవలు పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

### సేవలు ఆరంభిస్తాం



తెనాలి జిల్లా వైద్యశాలలో కంటి విభాగ సేవలు నిలచిన మాట వాస్తవం. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో పాటు సివిల్ సర్జన్ వైద్యురాలు గతనెలలో సెలవుపై వెళ్లారు. రిఫ్రాక్షనిస్ట్ పోస్ట్‌ను రద్దు చేయటంతో అక్కడ సేవలు అందించే వారు లేరు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. డిప్యూటేషన్‌పై వైద్యులను నియమించాలని కోరాం. ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్ పదోన్నతులు కౌన్సెలింగ్ జరుగుతుంది. కౌన్సెలింగ్‌లో తెనాలికి ఒకరు వచ్చే అవకాశం ఉంది. ఆప్తమాలజీ సేవలు త్వరలో పునఃప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్ సౌభాగ్యవాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్

### వ్యాధులు ప్రబలే కాలం

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబు



తెనాలిఅర్బన్: తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముువ్వా యేసుబాబు పేర్కొన్నారు. బీసీ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జ్వరాలు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందులపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, హెచ్‌వీ పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

### జాగర్లమూడిలో వైభవంగా గణపతి ఉత్సవాలు



తెనాలి: రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో తొమ్మిదిరోజుల గణేష్ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామంలోని రామాలయం సెంటర్లో శ్రీరామ గణేష్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 41వ గణేష్ ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు అయిదు వేలమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.అనంతరం జరిగిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక భక్తుడు రూ.23 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. గురువారం నిమజ్జన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

### రేపు ఉపాధ్యాయిని సంపూర్ణకు సత్కారం

తెనాలి: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో స్థానిక మారీసుపేటలోని చెంచు రామానాయుడు హైస్కూలు ఉపాధ్యాయిని ఆర్.సంపూర్ణను ఈ సందర్భంగా సత్కరిస్తామని క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల కృష్ణమోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. క్లబ్ కోశాధికారి డాక్టర్ కడియాల పల్లవి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

### రైస్‌కాలనీలో అన్నదానం

తెనాలిటౌన్: పట్టణ రామలింగేశ్వర పేటలోని రైస్‌కాలనీలోని దిబ్బలపై 10వ గణేష్ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీలక్ష్మీగణేష్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదానం చేశారు. దాదాపు 1500 మందికి అన్నదానం చేసినట్టు యూత్ సభ్యులు తెలియజేశారు.

## తెనాలి డిపో అభివృద్ధికి చర్యలు

డీపీటీవో సీహెచ్ విమల



డిపోను పరిశీలిస్తున్న డీపీటీవో విమల, డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ విమల పేర్కొన్నారు. తెనాలి డిపోను బుధవారం ఆమె పరిశీలించారు. ముందుగా గ్యారేజ్‌లో మొక్కలు నాటారు. అనంతరం బస్టాండ్ ఆవరణను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.36 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించేందుకు అవసరమైన అనుమతులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో తెనాలి డిపో అన్ని విషయాలలో ముందు వరుసలో ఉందన్నారు. గ్యారేజ్ విభాగంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా మహిళలకు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పథకం అమలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని కూడా పరిష్కరిస్తామని చెప్పారు. తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్ ఏర్పాటుపై మరోసారి సర్వే చేయిస్తామని, ఎక్కువ మంది ప్రయాణికులు కావాలని అడిగితే తప్పని సరిగా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### •ఛత్రపతి!

పట్టణానికి చెందిన నక్కా వెంకటేశ్వర్లు ఓ సైకిల్ మెకానిక్కు. శివాజీచౌక్‌లో నడిరోడ్డే ఆయన కేరాఫ్. ఎవరికైనా సైకిల్ రిపేరు వస్తే చకచకా చేసేయగలడన్న పేరున్న మెకానిక్కు. వాటిమీద వచ్చే అరకొరా డబ్బులతోనే ఆయన నిత్య జీవన సమరం. ఇక ఎండ-వానలతో తప్పని నిత్య సహవాసం ఆయనది. దీనివల్ల చేసే పనికి ఆటంకాలు ఎదురవుతుంటాయి. ఒక్కోరోజు ఆదాయం రాని స్థితి. దీన్ని గమనించిన సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం సభ్యులు చందు నాగరాజ కుమారి సహకారంతో వెంకటేశ్వర్లుకు బుధవారం వాటర్ ప్రూఫ్ గొడుగును ఉచితంగా ఇచ్చారు. ఆ రెండిటి నుంచి ఆయనకు కాస్తంత రక్షణ లభిస్తుందని సభ్యులు వెల్లడించారు.



పంపిణీ కార్యక్రమంలో కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, మాలేపాటి హేమ కుమార్, శెట్టిపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

- తెనాలిఅర్బన్

## బెల్లంకొండ వెంకట్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న బెల్లంకొండ వెంకట్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య విభాగంలోని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాంశాల్లో అత్యంత ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియా యాక్టివిటీస్ శిక్షణలో తెనాలికి చెందిన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ప్రశంసా పత్రం అందుకున్నారు. అత్యంత నాణ్యమైన విద్యాంశాలు, ఉత్తమ ఆచరణ పద్ధతులను సామాజిక మాధ్యమాల వేదికపై ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుల్లో గుంటూరుకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. వీరికి సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌పీడీ శ్రీనివాసరావు ప్రశంసాపత్రం, సోషల్ మీడియా పరికరాన్ని అందజేశారు. బెల్లంకొండ వెంకట్ స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో చిత్రకళ ఉపాధ్యాయుడిగా చేస్తున్నారు. ఎన్‌సీసీ అధికారిగా, గాయకుడిగా, నటుడిగా సమాజాన్ని చైతన్యపరుస్తూ విద్యార్థులను వివిధ రకాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆక్రమణదారులకు నోటీలు జారీ చేయండి

సబ్‌కలెక్టర్ సంజనా సింహ

కొల్లిపర: స్థలాలు, పంట పొలాలు అక్రమంగా ఆక్రమించుకొన్న అక్రమణ దారులకు అధికారులు నోటీసులు జారీ చేసి, ఆక్రమణలను తొలగించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ తహసీల్దారు జి.సిద్దార్థకు ఆదేశించారు. మండల పరిధిలోని అత్తోట, దావులూరిపాలెం గ్రామాల్లో పలు చోట్ల స్థలాలు, పంట పొలాలు ఆక్రమణలకు గురైనట్లు గ్రామస్తులు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు అందజేశారు. దీంతో ఆమె బుధవారం అధికారులతో కలసి పర్యటించి అక్రమాణలకు గురైన స్థలాలను పరిశీలించి, చుట్టు ప్రక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని దావులూరులో అనధికారంగా ముగ్గురు రైతులకు 19 సెంట్ల భూమి చెముడుబాడులో 5 సెంట్ల భూమి వెబ్ ల్యాండ్ నమోదు కావటంతో ఆ భూములను కూడా పరిశీలించి వారికి కూడా నోటీసులు జారీ చేయాలని అధికారులకు తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దారు సిద్ధార్థ, డీఎల్‌పీవో స్వరూపరాణి, సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.

## పోరాట స్ఫూర్తి - చైతన్య దీప్తి

- అందరివాడు ఉమేష్ చంద్ర
- జనజాగృతితో ప్రజాసంబంధాలకు కృషి
- మావోయిస్టులకు లొంగని మెండిఘటం
- పలు జిల్లాల్లో అభిమాన సంఘాలు
- పోరాట స్ఫూర్తిని ప్రదర్శించి అమరుడైన పోలీస్ టైగర్
- నేడు తెనాలిలో 26వ వర్ధంతి కార్యక్రమం



ఉమేష్‌చంద్ర (ఫైల్)

తెనాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టుల కాల్పులకు బలైన ముగ్గురు పోలీసు అధికారుల్లో చదలవాడ ఉమేష్‌చంద్ర ఒకరు. సూపర్ పోలీస్‌గా పేరుతెచ్చుకున్న ఆ ఐపీఎస్ అధికారి నిండు నూరేళ్ల జీవితం 33 ఏళ్లకే మావోయిస్టుల తుపాకీగుండ్లకు ముగిసిపోయింది. ఆ బలిదానానికి నేటితో 26 ఏళ్ల వుతుంది. ఆయన కన్నుమూసిన హైదరాబాద్‌లో ఏటా నిర్వహిస్తున్న సంస్మరణను, రాష్ట్ర విభజన తర్వాత స్వస్థలమైన తెనాలిలో జరుపుతున్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఉమేష్ చంద్ర సతీమణి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, పోలీస్ అధికారులు, ఉమేష్‌చంద్ర కుటుంబసభ్యులు ఇక్కడి చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. సాహసోపేత ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్రను స్మరించుకుందాం.

**జన్మస్థలం పెదపూడి**

తెనాలి సమీపంలోని అమృతలూరు మండల గ్రామం పెదపూడి ఉమేష్‌చంద్ర జన్మస్థలం. 1966 మార్చి 29న జన్మించారు. తలిదండ్రులు చదలవాడ నయనతార, వేణుగోపాలరావు. తాత చదలవాడ ఉమామహేశ్వరరావు జస్టిస్ పార్టీ నాయకుడు. తెనాలి తాలూకా బోర్డు అధ్యక్షులుగా పనిచేశారు. అమ్మతరపు తాత తుమ్మల జగన్మోహనరావు వ్యాపారవేత్త. తండ్రికి ఆల్విన్ ఫ్యాక్టరీలో సర్వీసు మేనేజరు ఉద్యోగం కారణంగా ఉమేష్‌చంద్ర బాల్యం హైదరాబాద్‌లో గడచింది.

1991లో ఐపీఎస్‌కు ఎంపికై ముస్సోరిలో ట్రెనింగ్ అనంతరం వరంగల్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. మావోయిస్టు కార్యకలాపాలకు పేరొందిన వరంగల్‌లో విధినిర్వహణ కత్తిమీదసాము అయినప్పటికీ నిజాయతీ కలిగిన అధికారిగా త్వరలోనే పేరుతెచ్చుకున్నారు. మావోయిస్టుల అణచివేత ఆపరేషన్స్‌లో ధైర్యంగా పాల్గొంటూ వచ్చారు. ఒక్కోసారి పోలీసు బృందాలకు నాయకత్వం వహించి నడిపించారు. సానుకూల దృక్పథం, నాయకత్వ లక్షణాలతో మావోయిస్టులపై పలు విజయాలను సాధించారు. తర్వాత కడప జిల్లాకు బదిలీపై వెళ్లి, అక్కడ కామన్‌మ్యాన్ పోలీసు ఆఫీసర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. అంకితభావాన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం ఆయనకు ఎస్పీగా పదోన్నతినిచ్చి కడప జిల్లాలో పోస్టింగు ఇచ్చింది. ప్రజల సమస్యలను సావధానంగా వినేందుకు రోజూ కొంత సమయాన్ని కేటాయించారు. తర్వాత డీజీపీ ఆఫీసుకు స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ ఏఐజీగా బదిలీ అయ్యారు. ఆ విధుల్లో వుండగానే 1999 సెప్టెంబరు 4న హైదరాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగినపుడు, మావోయిస్టులు ఆయన డ్రైవరు, గన్‌మ్యాన్‌పై కాల్పులు జరిపారు. హ్యాండ్‌గన్ తీసుకెళ్లకుండా బయలుదేరిన ఉమేష్ చంద్ర, వట్టిచేతులతోనే వారిని వెంటాడారు. పారిపోతున్న మావోయిస్టులు దీనిని గమనించి, వెనుదిరిగి కాల్పులకు దిగారు.

ప్రాణభీతితో వెన్నుచూపకుండా పోరాటస్ఫూర్తిని చాటిన ఉమేష్‌చంద్ర ఆ కాల్పుల్లో కన్నుమూశారు. ఉమేష్‌చంద్ర సతీమణి నాగరాణి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కాగా, కుమారుడు భరత్‌చంద్ర అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఉన్నారు.

## అర్ధరాత్రి వరకూ రాజన్న వర్ధంతి కార్యక్రమాలు

- వల్లభాపురంలో భారీగా అన్నదానం
- నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలు



అన్నదానం చేస్తున్న శివకుమార్, ఉత్తేజ్‌రెడ్డి



పిడపర్తిపాలెంలో వైఎస్ విగ్రహం వద్ద నివాళిలో శివకుమార్

వల్లభాపురం(తెనాలి): మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని కొల్లిపర మండలంలోని వల్లభాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం నుండి రాత్రి వరకు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి నేతృత్వంలో తొలుత వల్లభాపురం కరకట్ట మీద ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి గ్రామంలోకిభారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ సెంటర్లోని పేరంటాలమ్మ ఆలయం వద్ద డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అక్కడి నుంచి పార్టీ కొల్లిపర మండల మాజీ అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని దక్షిణవీధి రామాలయం వద్ద పెట్రోలు బంకు రోడ్డులోని వైఎస్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో వైఎస్సార్ వర్ధంతిని జరిపారు. అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ కొల్లిపర మండల అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డి, ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, మాజీ సర్పంచ్ వంగా సుధాకర్‌రెడ్డి, ఆళ్ల నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ సర్వేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పులగం సందీప్‌రెడ్డి, కొల్లిపర మండల యువజన విభాగం అధ్యక్షుడు ఈదా యశ్వంత్, పెద్ద సంఖ్యలో పార్టీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పిడపర్రులో...**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను పెంచిన ఏకైక ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. తన విప్లవాత్మక సంస్కరణలతో దేశవ్యాప్తంగా గుర్తింపునూ పొందారని చెప్పారు. కొల్లిపర మండల గ్రామం పిడపర్రులో మంగళవారం రాతి జరిగిన వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాల్లో శివకుమార్ పాల్గొన్నారు. గ్రామంలోని రెండుచోట్ల గల వై.ఎస్.విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పిడపర్రు గ్రామ సర్పంచ్ దూరు రత్నబాబు, మాజీ ఎంపీటీసీ కె.శ్రీనివాస్, శిఖ వెంకయ్య, ఎం.దావీదు, పి.ప్రకాష్, డి.ఇస్సాకు, ఎన్.మాణిక్యారావు, పి.ప్రభాకరరావు, దూరు హిట్లర్‌బాబు పాల్గొన్నారు. తొలుత మార్గమధ్యంలోని పిడపర్తిపాలెం గ్రామంలోని వై.ఎస్.విగ్రహానికి శివకుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

### రోడ్ల వెంట మొక్కలు నాటించాలి

ఎంపీడీవో విజయలక్ష్మి



కొల్లిపర: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలోని రోడ్ల వెంట మొక్కలు నాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రధాన రహదారి వెంట కిలో మీటరు పొడవునా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై ఇస్తున్న ఉద్యాన వన పంటలపై అవగాహ కల్పించాలన్నారు. సమావేశంలో ఏవో శ్రీనివాసరెడ్డి, ఏపీడీ శ్రీమన్నారాయణ, ఏపీవో వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.